Neti Velugu నేటి వెలుగు

నేటి సమాజం... నేటి వెలుగు...

RNI NO. TELTEL/2023/88559

తెలుగు దినపత్రిక

www.epaper.netivelugu.com

netivelugu63@gmail.com



నల్గొండ | సంపుటి : 3 | సంచిక : 206 | పేజీలు : 4 | నవంబర్ 11 బుధవారం 2026 | వెల రూ. 4.00/-

NALGONDA | VOL:3 | ISSUE: 206 | PAGES:4 | WEDNESDAY NOVEMBER 11 2026 | Rs. 4:00

తమిళనాడు ప్రభుత్వ ఖాతాల నుంచి 22.10 కోట్ల చోరీ

2



బాధితుల పక్షాన నిలబడండి.. మూలాలను మరువకండి: సీఎం రేవంత్ రెడ్డి

- నిజాయతీ, అంకితభావంతో పనిచేయాలని కొత్త డీఎస్పీలకు సీఎం సూచన
- తమ సామాజిక, ఆర్థిక నేపథ్యాలను ఎప్పటికీ మరువొద్దని హితవు
- 112 మంది డీఎస్పీల నియామకం పారదర్శకంగా పూర్తి చేశామని వెల్లడి
- డ్రగ్స్ మహమ్మారిని అరికట్టేందుకు ఈగిల్ ఫోర్స్ ఏర్పాటు చేశామని స్పష్టీకరణ

నిజాయతీ, నిబద్ధత, అంకితభావంతో విధులు నిర్వహించాలని, తాము వచ్చిన సామాజిక, ఆర్థిక మూలాలను ఎన్నడూ విస్మరించవద్దని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కొత్తగా నియమితులైన డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)లకు పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో నిర్వహించిన ప్రొబేషనరీ డీఎస్పీల (2025 బ్యాచ్) వీడ్కోలు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా


(మిగతా 2వ పేజీలో..)

ఏపీ కేబినెట్ నిర్ణయాలు.. పలు ప్రాజెక్టులకు ఆమోదముద్ర

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ భేటీ
- కొత్త పారిశ్రామిక పాలసీలకు గ్రీన్ సిగ్నల్
- భారీ పరిశ్రమలకు ఏపీ కేబినెట్ ఆమోదముద్ర

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన వెలగపూడిలోని సచివాలయంలో ఈరోజు జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి, పెట్టుబడుల ఆకర్షణ, యువతకు భారీగా ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కేబినెట్ పలు ప్రధాన ప్రాజెక్టులకు ఆమోద ముద్ర వేసింది. ఈ సమావేశంలో ఏవీజీసీ-ఎక్స్‌ఆర్ (AVGC-XR) పాలసీ 2026-31, ఏపీ రోబోటిక్స్ – ఫిజికల్ ఏఐ విధానాలతో పాటు సెమీ కండక్టర్ పాలసీ సవరణలకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్

(మిగతా 2వ పేజీలో..)



తెలంగాణలో పెరిగిన చలి తీవ్రత.. 29 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

2

- తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు తీవ్ర చలిగాలులు
- కొన్ని జిల్లాల్లో 12 డిగ్రీల వరకు పడిపోనున్న రాత్రి ఉష్ణోగ్రతలు
- ఈశాన్య దిశ నుంచి వీస్తున్న శీతల గాలులే ఉష్ణోగ్రతల పతనానికి కారణం

తెలంగాణ వ్యాప్తంగా చలి తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు



ఓయూ వీసీ ప్రభుత్వానికి గులాంగిరి చేస్తున్నారు: కవిత

- ఉస్మానియా యూనివర్సిటీలో నాన్ టీచింగ్ ఉద్యోగుల మహాధర్నా
- సిబ్బంది ఆందోళనకు మద్దతు తెలిపిన కవిత
- వర్సిటీకి ఇస్తానన్న రూ.1,000 కోట్ల నిధులు ఎక్కడంటూ ప్రభుత్వాన్ని నిలదీసిన వైనం

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ భవనం ఎదుట నాన్‌టీచింగ్ ఉద్యోగులు చేపట్టిన

(మిగతా 2వ పేజీలో..)



ఉత్తర భారతాన్ని కమ్మేసిన విషపూరిత పొగమంచు.. బయటపెట్టిన ఉపగ్రహ చిత్రాలు

- నాసా శాటిలైట్ చిత్రాల్లో ఉత్తర భారతాన్ని కమ్మేసినట్లు కనిపించిన దట్టమైన పొగమంచు
- ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ సహా హిమాలయ ప్రాంతాలకూ విస్తరించిన స్మాగ్ ప్రభావం
- దీపావళి తర్వాత మూడు రోజులుగా ఆకాశాన్ని కప్పేసిన బూడిద రంగు పొగ తెర
- రాజస్థాన్, గుజరాత్, ఈశాన్య రాష్ట్రాల్లో సాధారణంగానే ఉన్న వాతావరణం
- గాలుల వేగం పెరగడంతో ఢిల్లీలో 299 పాయింట్లకు తగ్గిన ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్

2



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్
ఎడిటర్ & పబ్లిషర్

ఓయూ వీసీ ప్రభుత్వానికి గులాంగిరి చేస్తున్నారు: కవిత

(మొదటి పేజీ తరువాయి)

మహాధర్నాకు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మంగళవారం మద్దతు తెలిపారు. కాంట్రాక్ట్ సిబ్బంది సర్వీసుల క్రమబద్ధీకరణతో పాటు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు చేపట్టిన ఈ ఆందోళనలో ఆమె స్వయంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించిన కవిత... రాష్ట్ర ప్రభుత్వంపై, విశ్వవిద్యాలయ ఉపకులపతి (వీసీ)పై తీవ్ర విమర్శలు గుప్పించారు. విశ్వవిద్యాలయ పరిపాలన తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ... ఉద్యోగులను ఓయూ వీసీ పట్టించుకోవడం లేదని, ఆయన ప్రభుత్వానికి గులాంగిరి చేస్తున్నారంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.దాదాపు ఏడాదిన్నర కాలంగా ఉద్యోగులు నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమని కవిత అన్నారు. సుమారు 35 ఏళ్లుగా ఉద్యోగులు వివిధ ప్రభుత్వాల హయాంలో దోపిడీకి గురవుతున్నారని పేర్కొన్నారు. నాన్‌టీచింగ్ సిబ్బంది పోరాటానికి పర్మినెంట్ ఉద్యోగులు కూడా మద్దతు తెలపడాన్ని ఆమె ప్రశంసించారు. విశ్వవిద్యాలయానికి ఛాన్సలర్‌గా వ్యవహరిస్తున్న రాష్ట్ర గవర్నర్ వెంటనే ఈ అంశంలో జోక్యం చేసుకోవాలని, నాన్‌టీచింగ్ సిబ్బంది న్యాయమైన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా ఆదేశాలు ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు.ఉస్మానియా యూనివర్సిటీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇస్తానన్న రూ.వెయ్యి కోట్లు ఎక్కడ? అని ఆమె సూటిగా ప్రశ్నించారు. నిధులు మంజూరు చేస్తామని ప్రకటించి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదని తప్పుబట్టారు.

తెలంగాణలో పెరిగిన చలి తీవ్రత.. 29 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

(మొదటి పేజీ తరువాయి)

వేగంగా పడిపోతుండటంతో ప్రజలు చలికి వణికిపోతున్నారు. రానున్న మూడు రోజుల పాటు రాష్ట్రంలో చలిగాలుల తీవ్రత మరింత ఎక్కువగా ఉండే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని 29 జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.వాతావరణ శాఖ వివరాల ప్రకారం... జోగులాంబ గద్వాల, ఖమ్మం, సూర్యాపేట, జనగామ మినహా మిగిలిన అన్ని జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల కంటే తక్కువకు పడిపోయే అవకాశం ఉంది. ముఖ్యంగా సంగారెడ్డి, మెదక్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, నిర్మల్, వనపర్తి జిల్లాల్లో చలి తీవ్రత మరింత అధికంగా ఉంటుందని, అక్కడ ఉష్ణోగ్రతలు దాదాపు 12 డిగ్రీల వరకు పడిపోవచ్చని అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే ఆదిలాబాద్ జిల్లాలోని నేరెడుగొండలో అత్యల్పంగా 14.7 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డైంది.దేశంలోని ఈశాన్య ప్రాంతాల నుంచి తక్కువ ఎత్తులో వీస్తున్న చల్లని గాలుల ప్రభావం వల్లే రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. ఈ మూడు రోజుల పాటు తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు పలు ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కమ్ముకునే అవకాశముంది. దీనివల్ల దృశ్యమానత (విజిబిలిటీ) తగ్గి రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని అధికారులు తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, అటవీ మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనదారులు ఉదయం వేళల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఏపీ కేబినెట్ నిర్ణయాలు.. పలు ప్రాజెక్టులకు ఆమోదముద్ర

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చింది. విశాఖ జిల్లా భీమునిపట్నంలో రూ.31,387 కోట్లతో ఏఎం ఇంటెలిజెన్స్ ఆధ్వర్యంలో 512 మెగావాట్ల గ్రీన్ ఇంటిగ్రేటెడ్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. నాయుడుపేటలో రూ.4,000.20 కోట్లతో కార్బన్ కాస్మో బ్యాటరీ మెటీరియల్ తయారీ ప్లాంట్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. అలాగే భోగాపురంలో రిలయన్స్ గిగా స్టీల్ ఏఐ డేటా సెంటర్‌కు 25 ఎకరాలు, తిరుపతిలో డిక్సన్ టెక్నాలజీస్‌కు స్థలం కేటాయింపునకు ఆమోదం లభించింది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రూ.570.20 కోట్లతో ఈపాక్ యూనిట్ కు ఆమోదముద్ర వేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా 2,565 మందికి ఉపాధి లభించనుంది. పశ్చిమ గోదావరిలో రూ.236.92 కోట్లతో రవళి స్పిన్నర్స్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు ద్వారా 1,569 మందికి ఉపాధి లభించనుంది. నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్కులో హెటిరో సంస్థలకు 173.82 ఎకరాలు కేటాయించారు.మరోవైపు, రాష్ట్రంలో రోడ్డు భద్రత కోసం డీజీపీ ఆధ్వర్యంలో ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు, తిరుమల శ్రీవారి ఆలయంలో 'ప్రధాన సన్నిధి యాదవ', 'సన్నిధి యాదవ' పోస్టుల సృష్టికి కేబినెట్ నిర్ణయించింది. థర్మల్ విద్యుత్‌కు ప్రత్యామ్నాయంగా ఎస్ఎంఆర్ టెక్నాలజీతో అణు విద్యుత్ ప్లాంట్ల సాధ్యాసాధ్యాల పరిశీలనకు, రాజధాని పరిధిలోని శాఖమూరులో కేంద్రీయ విద్యాలయానికి భూ కేటాయింపునకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది.

ధైర్యంగా కోలుకుంటోంది.. రాప్తాడు బాలిక ఆరోగ్యంపై లోకేశ్ ట్వీట్



రాప్తాడు జెడ్పీ హైస్కూల్‌లో మానసిక రోగి దాడిలో తీవ్రంగా గాయపడిన బాలికకు నిర్వహించిన ప్లాస్టిక్ సర్జరీ విజయవంతమైందని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ప్రస్తుతం బెంగళూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని, బాధితురాలు వేగంగా కోలుకుంటోందని ఆయన తెలిపారు.వైద్యులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా గాయాలకు సంబంధించిన డీబ్రిడ్‌మెంట్, కుట్లను సరిచేసే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారని లోకేశ్ పేర్కొన్నారు. బాలిక గాయాలు క్రమంగా నయమవుతున్నాయని, ఎడమ చేతికి ఉన్న స్లింగ్‌ను తొలగించడంతో ఆమె నెమ్మదిగా చేతిని కదిలిస్తోందని చెప్పారు. ఆ చిన్నారి ఎంతో ధైర్యంతో చికిత్సకు సహకరిస్తోందని ఆయన వివరించారు. ప్రస్తుతం ఆమెకు నొప్పి నివారణ మందులు, ఫీడింగ్ సపోర్ట్ అందిస్తున్నారని.. త్వరలోనే పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (పీఐసీయూ) నుంచి జనరల్ వార్డుకు మార్చుతారని మంత్రి పేర్కొన్నారు.

బాధితుల పక్షాన నిలబడండి.. మూలాలను మరువకండి: నూతన డీఎస్పీలతో సీఎం రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొని ప్రసంగించారు."మీ ప్రవర్తన, మీరు తీసుకునే నిర్ణయాలు ప్రభుత్వ పనితీరుపై, ప్రతిష్ఠపై నేరుగా ప్రభావం చూపుతాయి. కష్టాల్లో ఉన్నప్పుడు ప్రజలు తమ కుటుంబ సభ్యుల కంటే ముందుగా పోలీసులనే ఆశ్రయిస్తారు. గత తరం అధికారులు నెలకొల్పిన విశ్వసనీయతను మీరు కాపాడాలి" అని సీఎం సూచించారు.మొత్తం 112 మంది డీఎస్పీల నియామక ప్రక్రియను తమ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా పూర్తి చేసిందని రేవంత్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గ్రూప్-1 నియామకాల్లో తలెత్తిన వివాదాలను పరిష్కరించి, టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశామని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకంపై ఆధారపడిన సామాన్య కుటుంబాల బిడ్డలు సైతం డీఎస్పీలుగా ఎంపిక కావడమే ప్రభుత్వ పారదర్శకతకు నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో డ్రగ్స్ వినియోగం, అక్రమ రవాణా పెను సవాలుగా పరిణమించాయని, దీనిని సమర్థవంతంగా అడ్డుకునేందుకు ప్రత్యేకంగా 'ఈగిల్ ఫోర్స్'ను ఏర్పాటు చేసినట్లు సీఎం తెలిపారు. ఆధునిక పోలీసింగ్ పద్ధతుల్లో శిక్షణ కోసం అవసరమైతే కొత్త డీఎస్పీలను విదేశాలకు పంపేందుకు కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన హామీ ఇచ్చారు.

ఉత్తర భారతాన్ని కమ్మేసిన విషపూరిత పొగమంచు.. బయటపెట్టిన ఉపగ్రహ చిత్రాలు

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తర భారతదేశంలో వాయు కాలుష్యం తీవ్ర స్థాయికి చేరింది. దీపావళి పండుగ ముగిసిన రెండు రోజుల తర్వాత కూడా ఉత్తరాదిలోని అత్యధిక ప్రాంతాలను దట్టమైన పొగమంచు (స్మాగ్) కమ్మేసింది. అంతరిక్షం నుంచి తీసిన ఉపగ్రహ చిత్రాల్లో ఈ కాలుష్య మేఘాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని నాసా వరల్డ్‌వ్యూ తాజా చిత్రాల ద్వారా వెల్లడైంది. నాసా విడుదల చేసిన నవంబర్ 10 చిత్రాల ప్రకారం.. దేశ రాజధాని ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, వాటి సమీప రాష్ట్రాల్లో ఈ పొగమంచు ప్రభావం అత్యంత తీవ్రంగా ఉంది. ఇది మైదాన ప్రాంతాలకే పరిమితం కాకుండా ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కశ్మీర్ వంటి హిమాలయ పర్వత ప్రాంతాల వరకు విస్తరించింది. మరోవైపు మధ్య, దక్షిణ భారతదేశంలోనూ దీని ప్రభావం కొంతమేర కనిపించినప్పటికీ, తీవ్రత తక్కువగానే ఉంది. అయితే రాజస్థాన్, గుజరాత్ వంటి పశ్చిమ రాష్ట్రాలతో పాటు ఈశాన్య రాష్ట్రాల్లో వాతావరణం చాలావరకు నిర్మలంగా ఉన్నట్లు ఉపగ్రహ చిత్రాలు స్పష్టం చేస్తున్నాయి.దీపావళి నాటి నుంచి దేశంలోని వాయు పరిస్థితులను పరిశీలిస్తే గణనీయమైన మార్పులు కనిపిస్తున్నాయి. నవంబర్ 8న పండుగ సందర్భంగా బాణసంచా కాల్చడంతో ఢిల్లీ, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లతో పాటు ఇతర ఉత్తరాది ప్రాంతాలను దట్టమైన పొగ కప్పేసింది. నవంబర్ 9 నాటికి ఈ పొగ కొంత పలుచబడి పలు ఉత్తరాది రాష్ట్రాలు, బీహార్, పర్వత ప్రాంతాల మీదుగా విస్తరించింది. ఇక నవంబర్ 10 నాటికి ఇది మరింత విస్తృతమై, దేశంలోని విశాల భూభాగాన్ని దట్టమైన బూడిద రంగు దుప్పటిలా కప్పేసినట్లు నమోదైంది.శీతాకాలం ప్రారంభం కావడం, ఉష్ణోగ్రతలు పడిపోవడంతో పాటు వాతావరణ పరిస్థితుల వల్ల కాలుష్య కారకాలు గాలిలోనే చిక్కుకుపోతున్నాయి. దీనికి తోడు పొలాల్లో వ్యర్థాలు తగులబెట్టడం (స్టబుల్ బర్నింగ్), బాణసంచా పొగ, వాహనాల నుంచి వచ్చే ఉద్గారాలు తోడవ్వడంతో నవంబర్ మొదటి వారం నుంచే కాలుష్యం ప్రమాదకర స్థాయిలో కొనసాగుతోంది. ఈ తీవ్ర పరిస్థితుల నడుమ దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యత స్వల్పంగా మెరుగుపడటం కొంత ఊరటనిచ్చింది. మంగళవారం గాలుల వేగం పెరగడంతో ఢిల్లీ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (AQI) 299 వద్ద నమోదైంది. అంతకుముందు రోజు ఇది 376 పాయింట్లతో "చాలా తీవ్రమైన" (వెరీ పూర్) కేటగిరీలో ఉండగా, తాజాగా "పూర్" విభాగానికి చేరింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (CPCB) నిబంధనల ప్రకారం ఏక్యూఐ 201 నుంచి 300 మధ్య ఉంటే 'పూర్' అని, 301 నుంచి 400 మధ్య ఉంటే 'వెరీ పూర్'గా పరిగణిస్తారు. ప్రస్తుతానికి గాలి నాణ్యత కాస్త మెరుగైనప్పటికీ, కాలుష్య ప్రభావం ఇంకా కొనసాగుతుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

తమిళనాడు ప్రభుత్వ ఖాతాల నుంచి 22.10 కోట్లు చోరీ

నైజీరియా సైబర్ ముఠాపై పోలీసుల అనుమానం

న్యూఢిల్లీ : తమిళనాడు ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన మూడు బ్యాంకు ఖాతాల నుంచి రూ.22.10 కోట్లను సైబర్ నేరగాళ్లు కాజేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. తమిళ మీడియా కథనాల ప్రకారం.. రామనాథపురం జిల్లా మండపం పంచాయతీ యూనియన్ బ్యాంకు ఖాతా నుంచి రూ.14 కోట్లు, నాగపట్నం జిల్లా ఖాతా నుంచి రూ.3.10 కోట్లు, తిరుప్పూర్ జిల్లాలోని ధారాపురం పంచాయతీ ఖాతా నుంచి రూ.5 కోట్లు మళ్లించినట్లు వార్తలు వచ్చాయి. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం... ప్రభుత్వ ఖజానా నుంచి నిధులు జమ అయిన రెండు గంటల్లోనే సైబర్ నేరగాళ్లు వాటిని పలు అనుమానాస్పద బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసినట్లు తెలుస్తున్నది. ప్రభుత్వ లావాదేవీల కోసం వినియోగించే ప్రత్యేక పోర్టల్‌లోకి సైబర్ నేరగాళ్లు చొరబడి ఈ మోసానికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ వ్యవహారంలో నైజీరియా అంతర్జాతీయ సైబర్ నేరగాళ్ల ముఠా ప్రమేయం ఉండొచ్చని అనుమానిస్తున్నారు.



నక్సల్ రహిత భారత్ తర్వాత ఇదే మన ప్రధాన లక్ష్యం: అమిత్ షా

- **2028 డిసెంబర్ 31 నాటికి డ్రగ్స్ రహిత గుజరాత్ లక్ష్యమన్న అమిత్ షా**
- **దేశవ్యాప్తంగా 2029 నాటికి డ్రగ్ ఫ్రీ ఇండియా సాధన**
- **డ్రగ్స్ సమాచారం కోసం డిసెంబర్ 1 నుంచి హెల్ప్‌లైన్ 1033**
- **అహ్మదాబాద్‌లో రూ.1,400 కోట్ల పనులను ప్రారంభించిన అమిత్ షా**
- **మాదకద్రవ్యాల నిరోధానికి ప్రజా భాగస్వామ్యం తప్పనిసరి**

2028 డిసెంబర్ 31 నాటికి గుజరాత్‌ను పూర్తిగా మాదకద్రవ్యాల రహిత (డ్రగ్ ఫ్రీ) రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా 'డ్రగ్ ఫ్రీ ఇండియా' సాధనకు 2029 డిసెంబర్ 31ని గడువుగా నిర్ణయించామని, అయితే ప్రధాని నరేంద్ర మోదీ, తానూ గుజరాత్‌కు చెందిన వారం కావడంతో రాష్ట్రం ఏడాది ముందే ఈ లక్ష్యాన్ని అందుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.అహ్మదాబాద్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో సుమారు రూ.1,400 కోట్ల విలువైన అభివృద్ధి పనులను అమిత్ షా ప్రారంభించారు. వీటిలో ఇస్కాన్-సనంద్ ఎలివేటెడ్ కారిడార్‌తో పాటు పలు గృహ నిర్మాణ ప్రాజెక్టులు ఉన్నాయి. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశాన్ని నక్సల్స్ రహితంగా మార్చిన తర్వాత తదుపరి ప్రధాన లక్ష్యం డ్రగ్స్ రహిత భారత్‌ను నిర్మించడమేనని అన్నారు.రాష్ట్రంలో మాదకద్రవ్యాల నియంత్రణ కోసం డిసెంబర్ 1 నుంచి '1033' టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగంపై ఈ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని, వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ప్రత్యేక కంట్రోల్ రూమ్ ద్వారా తక్షణమే కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. డ్రగ్స్ విక్రయాల ద్వారా వచ్చే నిధులు ఉగ్రవాద కార్యకలాపాలకు చేరుతున్నాయని హెచ్చరించారు. డ్రగ్స్ మహమ్మారిని అంతం చేయడంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని అమిత్ షా పేర్కొన్నారు. విద్యార్థుల ప్రవర్తనను ఉపాధ్యాయులు నిశితంగా గమనించాలని సూచించారు. బాధి , తులకు చికిత్స అందించేందుకు డీ-అడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నా మని, వారి వివరాలు కూడా బయటకు రానివ్వమని ఆయన స్పష్టం చేశారు.



హాలియా కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను త్వరగా ప్రారంభించాలి





- మిగిలిపోయిన పనులన్నీ పూర్తి చేసి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి
- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

హాలియా, నవంబర్ 10 (నేటి వెలుగు):

హాలియాలో నూతనంగా నిర్మించిన 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మిగిలిపోయిన పనులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిని త్వరగా ప్రారంభించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.మంగళవారం అనుముల మండలం హాలియాలో నూతనంగా నిర్మించిన 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ సందర్శించి ఆసుపత్రిలోని వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనితారాణిని ప్రారంభానికి సంబంధించిన పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అవసరమైన వైద్య పరికరాలు, ఫర్నిచర్‌ను త్వరగా సమకూర్చుకొని ఆసుపత్రిని ప్రారంభించాలని ఆదేశించారు. పరికరాలు అందుబాటులోకి వచ్చిన వెంటనే ఓపీ సేవలను ప్రారంభిస్తామని సూపరింటెండెంట్ కలెక్టర్‌కు వివరించారు.ఈ సందర్భంగా ఓపీ విభాగం, గైనిక్ రూమ్, పీడియాట్రిక్ వార్డు, లేబర్ రూమ్, జనరల్ వార్డు, ఫార్మసీ, డిస్పెన్సరీ, ల్యాబ్, ఎముకల శస్త్రచికిత్స విభాగం, ఆపరేషన్ థియేటర్లను కలెక్టర్ పరిశీలించారు. ప్రతి విభాగంలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఆసుపత్రి పరిసరాలు, వార్డులను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు.ఉపయోగించిన నీడిల్స్, సిరంజీలు, కాటన్ తదితర వైద్య వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ కనిపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, బయోమెడికల్ వ్యర్థాలను నిబంధనల ప్రకారం తొలగించాలని స్పష్టం చేశారు. ప్రతి వార్డును ప్రతిరోజూ శుభ్రం చేయడంతో పాటు అన్ని విభాగాలకు స్పష్టంగా కనిపించేలా నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.అనంతరం ఆసుపత్రిలో తన భర్తతో కలిసి కూర్చున్న గర్భిణీ మహిళను కలెక్టర్ పలకరించి ఆమె ఆరోగ్య పరిస్థితి, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యులు సక్రమంగా వైద్యం అందిస్తున్నారా? అవసరమైన మందులు ఇస్తున్నారా? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని ప్రశ్నించారు. దీనికి స్పందించిన గర్భిణీ మహిళ వైద్యులు ఎంతో శ్రద్ధగా వైద్యం అందిస్తున్నారని కలెక్టర్‌కు తెలిపారు.ఈ కార్యక్రమంలో డీసీహెచ్ భానుప్రసాద్, మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనితారాణి, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ స్వాతి, డాక్టర్ నవీన్, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల ఆధ్వర్యంలో కోల్డ్ స్టోరేజీలు, గోదాముల నిర్మాణం





- వారంలో శంకుస్థాపనకు చర్యలు తీసుకుంటాం
- రైతులకు భరోసా ఇచ్చిన జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

హాలియా, నవంబర్ 10 (నేటి వెలుగు):

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు, పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు మహిళా సంఘాల ఆధ్వర్యంలో కోల్డ్ స్టోరేజీలు, గోదాముల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ వెల్లడించారు. అనువైన స్థలం అందుబాటులో ఉంటే వారం రోజుల్లోనే నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసేలా చర్యలు చేపడతామని తెలిపారు.మంగళవారం అనుముల మండలం శ్రీనాధపురం గ్రామంలో పంట పొలాల వద్ద రైతులతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడి సాగు పరిస్థితులు, నీటి లభ్యత, పంటల ఎంపిక, మార్కెట్ డిమాండ్ తదితర అంశాలపై చర్చించారు.ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో నీటి లభ్యత తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు ఆరుతడి పంటలు, తక్కువ నీరు అవసరమయ్యే పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను గుర్తించి సాగు చేయాలని, పంట చేతికి వచ్చే సమయానికి ధరలు ఎలా ఉంటాయో ముందుగానే అంచనా వేసుకోవాలని తెలిపారు.రైతులు పండించిన పంట ఉత్పత్తులను కోల్డ్ స్టోరేజీల్లో, గోదాముల్లో భద్రపరిచి మార్కెట్లో మంచి ధర వచ్చినప్పుడు విక్రయించడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని కలెక్టర్ వివరించారు. రైతులందరూ సమష్టిగా ముందుకు వస్తే మహిళా సంఘాల ఆధ్వర్యంలో కోల్డ్ స్టోరేజీలు, గోదాముల నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. వీబీ–జీ రామ్ జీ పథకం కింద గోదాముల నిర్మాణానికి ప్రణాళిక రూపొందిస్తామని వెల్లడించారు.కోల్డ్ స్టోరేజీలు, గోదాముల నిర్మాణం ద్వారా రైతులకు పంట నిల్వ సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని, తద్వారా తక్కువ ధరలకు పంటలను విక్రయించాల్సిన పరిస్థితి తప్పుతుందని పేర్కొన్నారు. ఈ అంశాలపై రైతులందరితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి గోదాముల నిర్మాణం, పంటల సాగు, మార్కెటింగ్ అవకాశాలపై అవగాహన కల్పించాలని జిల్లా అధికారులను ఆదేశించారు.100 రోజుల్లో చేతికి వచ్చే పంటలకు మార్కెట్లో ఎంత మేరకు గిరాకీ ఉందో తెలుసుకొని సాగు నిర్ణయాలు తీసుకోవాలని, శ్రీరామనవమి వరకు పరిస్థితులను గమనించి తదుపరి పంటల సాగుపై నిర్ణయం తీసుకోవాలని రైతులకు సూచించారు. చిక్కుడు, మినుములు, కందులు వంటి ఆరుతడి పంటలను సాగు చేయడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వినోద్ కుమార్, ఉద్యాన శాఖ అధికారి శేఖర్, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, సర్పంచ్ మల్రెడ్డి సీతమ్మ పాల్గొన్నారు.

నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ పథకం వరం

- ఉరుమడ్ల గ్రామానికి చెందిన నలుగురికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ
- పేదలకు అండగా తెలంగాణ ప్రభుత్వం: శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

చిట్యాల, నవంబర్ 10 (నేటి వెలుగు):

ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్సలు చేయించుకోలేని నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) పథకం గొప్ప వరమని తెలంగాణ రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ఈ పథకం ద్వారా పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని, తెలంగాణ ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు.మంగళవారం ఉరుమడ్ల గ్రామానికి చెందిన పాకాల రాములమ్మ, బోయ సతెమ్మ, శ్యామ్ సుందర్ రెడ్డి, మర్రి మాధవిలకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు అనారోగ్య సమయంలో వైద్య ఖర్చులు భారంగా మారుతున్నాయని, అలాంటి కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందించడం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.సీఎంఆర్ఎఫ్ సహాయం పొందిన లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



పేద విద్యార్థుల ఫీజులకు డబ్బుల్లేవంటారు.. ఓంకారేశ్వర మందిరానికి రూ.1,108 కోట్లు ఎలా కేటాయిస్తారు?

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం
- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ ఆగ్రహం

హైదరాబాద్ నవంబర్ 10 (నేటి వెలుగు):



పేద విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడానికి నిధులు లేవని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం, ఓంకారేశ్వర మందిరానికి రూ.1,108 కోట్లు ఎలా కేటాయిస్తుందని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ ప్రశ్నించారు. పేద విద్యార్థుల విద్యకు ప్రాధాన్యత ఇవ్వకుండా వారి భవిష్యత్తుతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా జాజుల లింగం గౌడ్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉండటంతో లక్షలాది మంది పేద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలలకు ఫీజులు చెల్లించకపోవడంతో విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, కొందరు తమ విద్యా సర్టిఫికెట్లు సైతం పొందలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయించడాన్ని తాము వ్యతిరేకించడం లేదని, అయితే అదే సమయంలో పేద విద్యార్థుల విద్యకు సంబంధించిన బాధ్యతను కూడా ప్రభుత్వం విస్మరించకూడదని స్పష్టం చేశారు. విద్య అనేది ప్రతి పేద విద్యార్థి భవిష్యత్తుకు పునాది అని, ఫీజు బకాయిల కారణంగా విద్యార్థుల చదువులు మధ్యలోనే ఆగిపోయే పరిస్థితి రావడం బాధాకరమని అన్నారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలన్నింటినీ తక్షణమే విడుదల చేయాలని, కళాశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని జాజుల లింగం గౌడ్ కోరారు.

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- అవగాహన పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్
- వ్యక్తిగత, బ్యాంకు వివరాలను గుర్తుతెలియని వ్యక్తులకు వెల్లడించవద్దు



నల్గొండ, నవంబర్ 10 (నేటి వెలుగు):

రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ సూచించారు. ప్రజల్లో సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించడంలో భాగంగా మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సైబర్ క్రైమ్ అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో పాటు అదనపు ఎస్పీ జి. రమేష్, సైబర్ క్రైమ్స్ డీఎస్పీ టి. లక్ష్మీనారాయణ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీ వ్యక్తిగత సమాచారాన్ని కాపాడుకోండి"లిలి అనే నినాదంతో ప్రజలకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించారు.బ్యాంకు అధికారులమని, కస్టమర్ కేర్ సిబ్బందిమని, ప్రభుత్వ అధికారులమని చెప్పి ఫోన్ చేసే గుర్తుతెలియని వ్యక్తులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీ, ఏటీఎం పిన్, సీవీవీ, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు ఖాతాలకు సంబంధించిన రహస్య సమాచారాన్ని వెల్లడించకూడదని సూచించారు. అనుమానాస్పద ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింకులు, ఆన్‌లైన్ అభ్యర్థనల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.ఏదైనా అనుమానాస్పద సమాచారం వచ్చినప్పుడు తొందరపడి స్పందించకుండా (ఆగండి -- ఆలోచించండి -- ధృవీకరించుకోండి)"లి అనే సూత్రాన్ని పాటించాలని సూచించారు.

సైబర్ మోసానికి గురైనప్పుడు వెంటనే ఫిర్యాదు చేసేందుకు ప్రజలకు అందుబాటులో ఉన్న మార్గాలను వివరించారు.

సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్: 1930

ఆన్‌లైన్ ఫిర్యాదు: www.cybercrime.gov.in

సైబర్ ఫ్రాడ్ రిజిస్ట్రీ వాట్సాప్ నంబర్: 8712672222

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు తమ వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని భద్రంగా ఉంచుకోవాలని, సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. సకాలంలో ఫిర్యాదు చేయడం ద్వారా మోసానికి గురైన దబ్బును తిరిగి పొందే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. నల్గొండ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డీ4సీ ద్వారా జిల్లావ్యాప్తంగా నిరంతరం సైబర్ నేరాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రజలకు సురక్షితమైన డిజిటల్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు దీపావళి శుభాకాంక్షలు

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా నవంబర్ 10(నేటి వెలుగు):



మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ శ్రీ మను చౌదరి గారిని సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి జి. వినోద్ కుమార్, కార్యదర్శి కురుమూర్తి, ఉపాధ్యక్షులు సాంబశివరావు (డిఆర్డిఓ), రవీందర్, కిషన్ నాయక్, క్రీడా కార్యదర్శి హరికృష్ణ, డీఎం (సివిల్ సప్లయ్) సుగుణ భాయి, జిల్లా ఉపాధి కల్పన అధికారి రాధిక, సిఈఓ కాంతమ్మ, డిటిఓ వెంకటేశ్వర్లు, డిపిఆర్ఓ స్వర్ణలత, ఏ ఎస్ డబ్ల్యూ గోపిచంద్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. అదేవిధంగా జిల్లా అభివృద్ధి, ప్రజాసేవలో అధికారులు మరింత అంకితభావంతో, సమర్థవంతంగా పనిచేయాలని పేర్కొన్నారు.

నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. సవీన్ కుమార్ గౌడ్

రైతులకు అండగా లేని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు!

- కష్టం రైతుది.. ధర వ్యాపారులదా?
- రైతుల కష్టాన్ని దోచుకుంటున్న వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్

మిర్యాలగూడ నవంబర్ 10 (నేటి వెలుగు):



ఆరుగాలం కష్టపడి పంటలు పండించిన రైతుకు తన పంటకు ధర నిర్ణయించుకునే అవకాశం లేకుండా పోయిందని, రైతుల కష్టాన్ని దోచుకుంటున్న వ్యాపారుల అరాచకాలకు అడ్డుకట్ట వేయకపోతే రైతుల తిరుగుబాటు తప్పదని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ హెచ్చరించారు. రైతుల శ్రమకు తగిన గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు, అధికారులు విఫలమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మిర్యాలగూడలో ఆయన మాట్లాడుతూ రైతులు యూరియా, ఎరువులు, పురుగుమందులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మించి అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేస్తున్నారని, అదే రైతులు పండించిన పంటలకు మాత్రం ధర నిర్ణయించే అధికారం రైతులకు లేకుండా పోయిందని విమర్శించారు. రైతులు పండించిన ధాన్యానికి రైస్ మిల్లర్లు, వ్యాపారులు ధరలు నిర్ణయించడం ఏమిటని ప్రశ్నించారు.క్వింటాల్ ధాన్యానికి రైతులకు కేవలం రూ.3,000 నుంచి రూ.3,200 వరకు మాత్రమే చెల్లిస్తూ, అదే బియ్యాన్ని సామాన్య ప్రజలకు క్వింటాల్‌కు రూ.7,200 వరకు విక్రయిస్తూ రైతులను, వినియోగదారులను వ్యాపారులు దోచుకుంటున్నారని ఆరోపించారు. రైతుల కష్టాన్ని దోచుకుంటున్న రైస్ మిల్లర్లు, వ్యాపారులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.వ్యాపారులు ఇంతటి అక్రమాలకు పాల్పడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వాలు, అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని విమర్శించారు. రైతుల సమస్యలపై ప్రశ్నించాల్సిన ప్రతిపక్షాలు సైతం మొద్దు నిద్రపోతున్నాయని ఎద్దేవా చేశారు. రైతుల ఓట్లు కావాలనే రాజకీయ పార్టీలు, నాయకులు వారి సమస్యల పరిష్కారానికి మాత్రం ముందుకు రావడం లేదని, దీని వెనుక ఉన్న కారణాలపై రైతుల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు రైతుల పక్షాన నిలబడి వ్యాపారుల దోపిడీని ప్రశ్నించాలని, రైతులకు న్యాయం జరిగేలా పోరాటం చేయాలని కోరారు.రైతుల శ్రమకు తగిన గిట్టుబాటు ధర కల్పించకపోతే భవిష్యత్తులో రైతుల ఆగ్రహాన్ని ప్రభుత్వాలు ఎదుర్కోవాల్సి వస్తుందని తిరుమలగిరి అశోక్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దాసరాజు జయరాజు, నాయిని భాస్కర్, పట్టేటి రమేష్, బోయిన ఉపేందర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ వాటర్ ట్యాంకర్ల నిర్వహణను పరిశీలించిన జలమండలి జేఎండీ మయాంక్ మిట్టల్

- ముల్లకత్వ చెరువు ఎస్టీపీ, గ్రీన్ ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్ తనిఖీ
- శుద్ధి చేసిన నీటి నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆదేశం
- ఎయిర్ టెక్ మిషన్లలో తాగునీటికి బదులుగా శుద్ధి చేసిన నీటిని వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచన




హైద్రాబాద్ నవంబర్ 10(నేటి వెలుగు)

జలమండలి జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ (జేఎండీ) మయాంక్ మిట్టల్ మంగళవారం ముల్లకత్వ చెరువు మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని (ఎస్టీపీ) సందర్శించి, గ్రీన్ వాటర్ ట్యాంకర్ల కార్యకలాపాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్టీపీలో ఏర్పాటు చేసిన గ్రీన్ ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. శుద్ధి చేసిన నీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఫిల్లింగ్ స్టేషన్‌ను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి దశలో నీటి నాణ్యతను నిర్ధారించుకోవాలని, నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.ముఖ్యంగా జలమండలి పరిధిలో వినియోగిస్తున్న ఎయిర్ టెక్ మిషన్లలో తాగునీటికి బదులుగా ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని ఉపయోగించేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అదేవిధంగా నిర్మాణ పనులు, ఉద్యానవనాల నిర్వహణ, రోడ్ల శుభ్రత తదితర తాగేతర అవసరాలకు శుద్ధి చేసిన నీటి వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. తద్వారా విలువైన తాగునీటిని ఆదా చేయాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జలమండలి సైబరాబాద్ ఈడి సంతోష్, ఎస్టీపీ సీజియం పద్మజాతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి





- ఎన్నికల యంత్రాల భద్రతపై ప్రత్యేక దృష్టి
- భద్రతా ఏర్పాట్లలో నిర్లక్ష్యం వహించవద్దని అధికారులకు ఆదేశం

రంగారెడ్డి జిల్లా, నవంబర్ 10 (నేటి వెలుగు):

ఎన్నికల నిర్వహణలో అత్యంత కీలకమైన ఈవీఎంల భద్రత, నిల్వ, పరిరక్షణ విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఆదేశించారు. ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పటిష్టమైన చర్యలు కొనసాగించాలని సూచించారు.మంగళవారం రాజేంద్రనగర్‌లోని ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు) గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, ఐఏఎస్ సందర్శించి తనిఖీ చేశారు. సాధారణ నెలవారీ పరిశీలనలో భాగంగా గోడౌన్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి, గోడౌన్‌కు ఏర్పాటు చేసిన సీల్స్‌ను తనిఖీ చేశారు. ఈవీఎంల భద్రత, నిల్వ, పరిరక్షణకు సంబంధించి చేపడుతున్న చర్యలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్ యంత్రాలు, ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన విధానాన్ని పరిశీలించారు. గోడౌన్‌లో ఏర్పాటు చేసిన సీసీటీవీ నిఘా వ్యవస్థ పనితీరును తనిఖీ చేసి, నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.అనంతరం ఈవీఎం గోడౌన్ వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల సామగ్రి భద్రతకు సంబంధించి నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పటిష్టమైన భద్రతా చర్యలు అమలు చేయాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఆర్డీఓ శ్రీధర్, తహశీల్దార్, వేర్‌హౌస్ ఇన్‌చార్జి రాములు, ఎన్నికల విభాగం అధికారులు రవీంద్ర గుప్తా, పోలీసు అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



జర్నలిస్టుల సంక్షేమానికి టీయూడబ్ల్యూజే కృషి అభినందనీయం





వికారాబాద్ సభలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్ జిల్లా నవంబర్ 10(నేటి వెలుగు)

రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం దశాబ్దాల తరబడి టీయూడబ్ల్యూజే చేస్తున్న కృషి అభినందనీయమని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు.మంగళవారం నాడు వికారాబాద్ పట్టణంలోని సత్యభారతి ఫంక్షన్ హాలులో జరిగిన తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(టీయూడబ్ల్యూజే) వికారాబాద్ జిల్లా తృతీయ మహాసభకు ఆయన ముఖ్య అథితిగా హాజరై ప్రసంగించారు.సమాజంలో ఎంతో గౌరవప్రదమైన జర్నలిజం వృత్తి పక్కదారి పట్టకుండా చూసుకోవాల్సిన బాధ్యత మీడియా సంస్థలపై, జర్నలిస్టులపై ఉంటుందని స్పీకర్ సూచించారు. ముఖ్యంగా ప్రజలకు పక్షపాతిగా వ్యవహరిస్తూ, వారి హక్కులకు భంగం వాటిల్లకుండా ఉండేందుకు జర్నలిస్టులు చురుకైన పాత్ర పోషించాలని ఆయన తెలిపారు. సంచలనాలు, కల్పితాలు, అవాస్తవాలకు దూరంగా వృత్తి ధర్మాన్ని పాటిస్తూ, నిజాయితీగా సమాచారాన్ని అందించే మీడియా సంస్థలను, జర్నలిస్టులను ప్రజలు అక్కున చేర్చుకుంటారని ప్రసాద్ కుమార్ స్పష్టం చేసారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడివుందని, దశల వారీగా వాటి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు ఆయన అన్నారు. వికారాబాద్ జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు అందించామని, ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డుల కోసం తమ వంతు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.ఈ సభకు గౌరవ అథితిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ మాట్లాడుతూ, జర్నలిస్టుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతూనే మరోవైపు జర్నలిస్టుల్లో నైతిక విలువలను పెంపొందించేందుకు తమ సంఘం 75యేండ్లుగా కృషి చేస్తుందని ఆయన అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో జర్నలిస్టులకు అందుతున్న సౌకర్యాలన్నీ తమ సంఘం పోరాట ఫలితమేనన్నారు. రాష్ట్రంలో అకాల మరణం చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు 5లక్షల రూపాయల ఆర్థిక సహాయం, జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, హెల్త్ కార్డులను అందించి ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని విరాహత్ అలీ ప్రభుత్వాన్ని కోరారు. అలాగే మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు మీడియా అకాడమీ నుండి ప్రస్తుతం అందిస్తున్న తక్షణ సహాయాన్ని లక్షా రూపాయల నుండి 2లక్షలకు పెంచాలని, ఐదేళ్ల పాటు ప్రతి నెల మృతుని భార్యకు చెల్లించే 3వేల రూపాయల పెన్షన్ ను 10వేల రూపాయలకు పెంచాలని ఆయన కోరారు. ఇంకా ఈ సభలో శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, తాండూర్ శాసన సభ్యులు మనోహర్ రెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ, ఐజేయు జాతీయ ఉపాధ్యక్షులు వై. నరేందర్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి మోతే వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహాచారీ, శ్రీధర్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సలీంలతో పాటు దాదాపు 300మంది జర్నలిస్టులు పాల్గొన్నారు.



Edited, Published and owned by **PAMANAGUDNDLA NAVEEN KUMAR,** Printed at **SRI printers** at H.No. 1-47/1, Ganesh Nagar, Dandampelly, Nalgonda , Telangana State : Editor, **PAMANAGUDNDLA NAVEEN KUMAR** : **RNI No. TELTEL 2023/88559**, Cell : **9553276552,**